క్లుప్తంగా

హుజూర్‌నగర్‌కు రెండు కోర్టులు మంజూరు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే హుజూర్‌నగర్‌లో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు కొనసాగుతుండగా తాజాగా రెండు న్యాయస్థానాలు మంజూరు కావడంతో మొత్తం న్యాయస్థానాల సంఖ్య ఆరుకు చేరినట్లు తెలిపారు. నూతనంగా మంజూరైన న్యాయస్థానాలకు త్వరలోనే సిబ్బందిని కేటాయిస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

మాల మహానాడు రాష్ట్ర మహిళా కార్యదర్శిగా సుమలత



చెన్నయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న సుమలత

మునగాల : మాల మహానాడు రాష్ట్ర మహిళా కార్యదర్శిగా మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన పాలపాటి సుమలత నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య చేతుల మీదుగా సుమలత నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ తన మీద నమ్మకంతో రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూరుగు వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరళకు కృతజ్ఞతలు తెలిపారు. మాలల అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు.

సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాజునాయక్

పాలకవీడు : సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడిగా పాలకవీడు మండలం కల్మటితండాకు చెందిన భూక్యా రాజునాయక్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సేవాలాల్ సేన బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలాజీనాయక్



నడిగూడెం : సేవాలాల్ రైతు సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నడిగూడెం మండల కేంద్రానికి చెందిన లావూరి బాలాజీ నాయక్ ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సేవాలాల్ సేన సమావేశంలో బాలాజీ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

నర్సరీల పరిశీలన

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్ ను ఎంపీడీఓ హారిసింగ్ శనివారం పరిశీలించారు. అనంతరం సిరిపురంలోని అంగన్‌వాడీ కేంద్రం, కరివిరాల, సిరిపురం, వల్లాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాలు, నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని అన్నారు. ఆయన వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిఈశ్వరి, పంచాయతీ కార్యదర్శులు సతీష్ కుమార్, మల్లారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

అనంతమ్మ మృతికి సంతాపం

చిలుకూరు : చిలుకూరు గ్రామ మాజీ సర్పంచ్, ప్రత్యేక తెలంగాణ ఉద్యమవేత్త కీ.శే కస్తూరి అంజయ్య సతీమణి అనంతమ్మ (80) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల కోదాడ ప్రముఖ వైద్యుడు జాస్తి సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, చిలుకూరు ప్యాక్స్ చైర్మన్ అలసకాని జనార్దన్, డీఎల్‌డీఏ మాజీ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అక్కినపల్లి జానకీరామాచారి, అంబాల రాంబాబు, తాళ్లూరి శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కృష్ణకుమార్‌కు నివాళి

మోతె : సామాజిక కార్యకర్త, కళాకారుడు, ఉర్లుగొండ మాజీ సర్పంచ్ లంజపెల్లి కృష్ణకుమార్ సామాజిక సేవలు మరువలేనివని మోతె మండల ప్రజానాట్య మండలి కళాకారులు, పలు పార్టీల నాయకులు కొనియాడారు. శనివారం మోతె మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో లంజపెల్లి కృష్ణకుమార్ దశదిన కర్మ (సంస్మరణ సభ)లో వారు పాల్గొని కృష్ణకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం కృష్ణకుమార్ కుటుంబసభ్యులకు ఉర్లుగొండ గ్రామస్తులు, యూత్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు.

రోడ్లకు మోక్షం.. ప్రజల హర్షం



కాగితరామచంద్రాపురం రోడ్డు పనుల్లో భాగంగా శ్రీరామాంజనేయనగర్ వద్ద మట్టి చదును చేస్తున్న దోజర్



నారాయణపురంలో పూర్తయిన వంతెన నిర్మాణం

- డబుల్ రోడ్ల నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు

నడిగూడెం : మండలంలోని పలు ప్రధాన రోడ్లకు మహర్దశ పట్టింది. మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చొరవతో డబుల్ రోడ్ల నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. ఇప్పటికే ఆయా డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

రూ.2.50 కోట్లతో డబుల్ రోడ్డు..

నడిగూడెం మండల కేంద్రం నుంచి చాకిరాల, రత్నవరం, వాయిలసింగారం, వసంతాపురం, అమీనాబాద్, అనంతగిరి గ్రామాల మీదుగా అనంతగిరి మండలం శాంతినగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రోడ్లు, భవనాల శాఖ నుంచి రూ.2.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల మధ్య వంతెనల నిర్మాణం కూడా పూర్తయింది. రహదారికి ఇరువైపులా మట్టి పోసి చదును చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో కోదాడకు రద్దీ పెరగనున్నది.

నడిగూడెం– కాగితరామచంద్రాపురం రోడ్డు..

నడిగూడెం మండల కేంద్రం నుంచి నారాయణపురం, కరివిరాల క్రాస్ రోడ్, కాగితరామచంద్రాపురం మీదుగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మండడినర్సయ్యగూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.2.0 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే వంతెనల నిర్మాణం పూర్తయింది. రహదారి విస్తరణలో భాగంగా మట్టి పనులు జరుగుతున్నాయి. కాగితరామచంద్రాపురంలో రహదారికి ఇరువైపులా ఇప్పటికే డ్రెయినేజీ నిర్మించారు. ఈ రహదారి నిర్మాణంతో ఖమ్మంకు రద్దీ పెరగనున్నది.

వంతెనల నిర్మాణం పూర్తి..

నారాయణపురం క్రాస్ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామంలోకి దాదాపు మూడు కిలో మీటర్ల మేర బీటీ రహదారి, సీసీ రహదారి నిర్మించనున్నారు. ప్రస్తుతం గ్రామంలో వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామంలో రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు నెలలలో రోడ్ల పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే మండలంలో అనేక ఏళ్లుగా ఇరుకైన రోడ్లు, దానికి తోడు ఇరుపక్కలా కంపచెట్లతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలను కలిపే రోడ్లు డబుల్ రోడ్లుగా మారుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలల్లోపే పనుల పూర్తికి కృషిచేస్తాం

రోడ్లు భవనాల శాఖ నిధులతో రూ.4.50 కోట్లతో నడిగూడెం నుంచి కాగితరామచంద్రాపురం, నడిగూడెం నుంచి శాంతినగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆరు నెలల్లోపే పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. రోడ్డు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– శివకుమార్, ఏఈఈ, రోడ్లు, భవనాల శాఖ, నడిగూడెం

నేడు పాపన్నగౌడ్ విగ్రహం ఆవిష్కరణ



ర్యాలీలో పాల్గొన్న విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, యువకులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో ఆదివారం నిర్వహించే బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బహుజనవాదులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అనంతు కర్ణాకర్‌గౌడ్ కోరారు. శనివారం విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. విగ్రహ ప్రారంభోత్సవానికి సీఐ చరమందరాజు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చామకూరి గురుస్వామి, నేలపట్ల వెంకటేశ్వర్లు, వీరమళ్ల రమేష్, కమిటీ గౌరవ అధ్యక్షుడు చామకూరి అంజి, బత్తిని రాంబాబు, నేలపట్ల అశోక్, పోలంపల్లి అంజి, మండవ రవి, సాయి, గురుస్వామి, చంటి, శోభన్, శ్రీనివాస్, సతీష్, ప్రసాద్, మహేష్, గోపి, నాగేంద్రబాబు, ప్రదీప్, సైదులు, నర్సయ్య, వీరబాబు, బన్ని తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రానికి వితరణ



గురువయ్యను సన్మానిస్తున్న సత్రం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రానికి మండలంలోని యాతవాకిళ్లకు చెందిన ఇరుగుర్తి గురువయ్య తన భార్య కమలమ్మ జ్ఞాపకార్థం శనివారం బీరువా, టేబుల్, కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా దాత గురువయ్యను సత్రం కమిటీ అధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య ఆధ్వర్యంలో సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి జగన్నాథాచారి, ఉపాధ్యక్షులు నరసింహాచారి, విష్ణుమూర్తి, వెంకటేశ్వరాచారి, కోశాధికారి త్రయంబకాచారి, సహాయ కార్యదర్శి శ్రీనివాసాచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌చారి, కార్యవర్గ సభ్యులు నరసయ్యాచారి, వీరబ్రహ్మాచారి, ముత్యాచారి, పరిపూర్ణాచారి, నరసరాచారి, లక్ష్మణాచారి, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

గరిడేపల్లి : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నికకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ దిమ్మెలు నిర్మించి ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద పండుగగా నిర్వహించాలని తెలిపారు. ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పిట్ట వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా బొజ్జ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా పిట్ట నాగరాజు, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి మైసయ్య, కోశాధికారిగా మచ్చ నరసింహ, సోషల్ మీడియా ఆర్గనైజర్‌గా పిట్ట రాజేష్, కోఆర్డినేటర్‌గా వీరేందర్, మరికొంత మందిని ఎన్నుకున్నారు. కొత్తపల్లి రవిమాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోట వీరస్వామి, కుర్రి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ నూతన కమిటీలు ఎన్నిక

అనంతగిరి : ఉద్యమం బలోపేతానికి ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్‌ఎఫ్, ఎమ్మెస్పీ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూర వెంకటేశ్వర్లు మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకట్రాంపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను పెద్ద ఎత్తున జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్పీ గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొండపల్లి అఖిల్, ఉపాధ్యక్షులుగా కొండపల్లి కోటి, కొండపల్లి పూర్ణ, ప్రధాన కార్యదర్శిగా కొండపల్లి కరుణాకర్, కార్యదర్శులుగా జెల్లి ప్రేమ్, కొండపల్లి జాను, ప్రచార కార్యదర్శులుగా కొండపల్లి కార్తీక్, కొండపల్లి సంతూన్, కొండపల్లి రమేష్, ఎంఎస్పీ గ్రామ అధ్యక్షులుగా కొండపల్లి సుధాకర్, కొండపల్లి సతీష్, ప్రధాన కార్యదర్శిగా జెల్లి దేవరాజు, కార్యదర్శులుగా కొండపల్లి సైదులు, బాబు, ఎంఎస్‌ఎఫ్ గ్రామ అధ్యక్షుడిగా కొండపల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి కళ్యాణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

15 మంది యువకుల బైండోవర్

నేరేడుచర్ల : ఇటీవల నేరేడుచర్లలోని రామాపురం వైన్స్ వద్ద జరిగిన ఘర్షణ కేసులో 15 మంది యువకులను శనివారం తహసీల్దార్ సురగి సైదులు ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. ఎలాంటి ఘర్షణలకు పాల్పడొద్దని యువకులకు సూచించారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి సహకరించండి



నేరేడుచర్ల : వేర్ హౌజ్ గోదాంలో సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

నేరేడుచర్ల : జూలై 9వ తేదీన నిర్వహించతలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికి సహకరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి కోరారు. శనివారం నేరేడుచర్లలోని వేర్ హౌజ్ గోదాంలో సమ్మె నోటీస్ అందించి మాట్లాడారు. వేర్ హౌజ్ హమాలీ సంఘం అధ్యక్షుడు కోడిరెక్క శ్రీనివాస్, కార్మికులు, తదితరులు ఉన్నారు.

సమాన పనికి సమాన వేతన చట్టం అమలుచేయాలి

మఠంపల్లి : కిష్టపట్టి ప్రాంతంలో గల సిమెంట్ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతన చట్టాన్ని అమలు చేయాలని కిష్టపట్టి ఏరియా క్లస్టర్ కమిటీ సభ్యుడు, టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. జూలై 9న జరుపతలపెట్టిన కార్మికుల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ఆయన మండలంలోని పలు సిమెంట్ పరిశ్రమల కార్మికులకు కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు హనుమాన్, శ్రీను, రామకృష్ణ, అజార్, వెంకన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సమ్మె నోటీస్ అందజేత

మఠంపల్లి : జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించ తలపెట్టడంతో మఠంపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ వెంకటాచారికి మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) కార్మికులు శనివారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సయ్యద్ రసిూయా, రాజ్యలక్ష్మి, లత, శాంతకుమారి, అన్నమ్మ, సామ్రాజ్యం పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మఠంపల్లి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. శనివారం మఠంపల్లిలో జరిగిన ఆ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల భద్రత, సంక్షేమానికి పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న చేపట్టబోయే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, జిల్లా నాయకులు పోకల వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల సమస్యపై అభిప్రాయాలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : బనకచర్ల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాండు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026 మార్చి వరకు దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్రం పదే పదే ప్రకటనలు చేస్తూ నరమేధం సృష్టిస్తోందని ఆరోపించారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ చెబుతున్నా కేంద్రం వారితో చర్చలు జరపకుండా ఏకపక్షంగా కాల్పులకు తెగబడుతుందని అన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పల్లె వెంకటరెడ్డి, డి.బ్రహ్మం, వి.సైదులు, పి.హుస్సేన్, శీలం శ్రీను, యోన, మురళి, వీరమల్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు



చిలుకూరులో జాతీయ రహదారిపై విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు : కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరు మండల కేంద్రంలో స్తంభాలకు నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది రెండు రోజులుగా మరమ్మతులు చేపడుతున్నారు. చిలుకూరులో స్తంభాలకు విద్యుత్ దీపాలు వెలగక రోడ్డు అంధకారంలో ఉండడంపై సాక్షి దినపత్రికలో పలుమార్లు కథనాలు రావడంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించారు. డివైడర్లపై గల విద్యుత్ స్తంభాలకు కొత్త లైట్లు ఏర్పాటు చేశారు. డివైడర్ మధ్యలో గడ్డి ఉండడంతో దాన్ని మేసేందుకు గేదెలు వచ్చి ప్రమాదాలు జరుగుతుండడంతో డివైడర్‌ను శుభ్రం చేశారు. దీంతో రాత్రి సమయంలో ఇన్నాళ్లు ఇబ్బందులు పడిన వాహనదారులు, గ్రామస్తుల సమస్య పరిష్కారమైంది.

దుమ్ము లేవకుండా చర్యలు



కంకరపై ట్యాంకర్‌తో నీరు చల్లుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు : మండలంలోని బేతవోలు డబుల్ రోడ్డు పనుల్లో భాగంగా కంకర పరిచి బీటీ వేయకపోవడంతో వాహనాల రాకపోకలకు విపరీతంగా దుమ్ములేస్తూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఈ నెల 23వ తేదీన సాక్షి పత్రికలో 'కంకర పరిచారు.. బీటీ మరిచారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. దుమ్ము లేవకుండా కంకరపై రెండు వాటర్ ట్యాంకర్లతో నీరు చల్లుతున్నారు. దీంతో వాహనదారులకు దుమ్ము సమస్య నుంచి విముక్తి లభించింది. అదేవిధంగా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు సాక్షికి తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పుట్టినిల్లు

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



వాయిలసింగారంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

అనంతగిరి : అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పార్టీ పుట్టినిల్లు లాంటిదని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండలంలోని వాయిలసింగారం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం భవనాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోదాడ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో రూ.9 కోట్లతో నిర్మించబోతున్న తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ కార్యాలయాల నిర్మాణానికి కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ కె.హిమబిందుతో కలిసి స్థలాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో డీటీ శ్రీధర్, ఆర్‌ఐ వెంకటనగేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, కొండపల్లి వాసు, చుండూరి వెంకటేశ్వరరావు, డేగ కొండయ్య, గుర్రం వెంకటరెడ్డి, ఈదుల కృష్ణయ్య, ఆకారపు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోషిరెడ్డి సేవలు మరువలేనివి

అనంతగిరి : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రోషిరెడ్డి మృతి బాధాకరమని, ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపురంలో రోషిరెడ్డి మృతదేహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, కొండపల్లి వాసు, డేగ కొండయ్య, కత్రం నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవలో ముందుండాలి



సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

కోదాడరూరల్ : రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలల్లో ఆయన మాట్లాడారు. శేష జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా గడపాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, ప్రతినిధులు బొల్లు రాంబాబు, పొట్ట జగన్మోహన్‌రావు, హనుమారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించేందుకు సిద్ధం కావాలి

- ఆర్డీఓ సూర్యనారాయణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

నడిగూడెం : రెవెన్యూ సదసుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. శనివారం నడిగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుల కోసం అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, విచారణ జరపాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వి.సరిత, ఆర్‌ఐలు గోపాలకృష్ణ, రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వెటర్లు అందజేస్తున్న దాతలు, ఎంఈవో చత్రునాయక్

గరిడేపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో చత్రునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 88 వేలు విలువ గల 45 స్టడీ చైర్లను అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు రూ.18 వేలు విలువ చేసే స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పూర్ది రామకిషోర్ రెడ్డి, పూర్విక రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని పాఠశాలలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.హైమావతి, జి. దీప్తి, కిషోర్, సౌజన్య, కందుల వీరనారాయణరెడ్డి, కస్తూరి, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు వృద్ధి



గరిడేపల్లిలో ఇంకుడు గుంత నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో సరోజ

గరిడేపల్లి : ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భజలాలు వృద్ధి చెంది బోర్లలో నీరు సమృద్ధిగా ఉంటుందని ఎంపీడీఓ సరోజ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్స్, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, ఏపీఓ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు త్రిపురం అంజన్‌రెడ్డి, బండ నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణారావు, చిరంజీవి, ఈసీ సుజాత, శిరీష, శ్రీను, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, సైదా, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



దుకాణాలు కొలుస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వ్యాపారం చేసుకునే దుకాణాల నిర్వహకులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలోని దుకాణాలను మున్సిపల్ సిబ్బంది పొడవు, వెడల్పు కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది ప్రతి దుకాణాన్ని కొలతలు వేసిన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసి ట్రేడ్ లైసెన్స్‌లు ఇస్తామని అన్నారు. ట్రేడ్ లైసెన్స్ కోసం ఆధార్ కార్డు, దుకాణం ఫొటో, ఇంటి పన్ను రశీదు తీసుకొని మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ



గరిడేపల్లి : విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గరిడేపల్లి : అంతర్జాతీయ పేదల దినోత్సవాన్ని పురస్కరించుకొని గరిడేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ సభ్యుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి ఆర్థిక సహకారంతో రూ.18 వేలు విలువ గల నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, క్లబ్ కార్యదర్శి సైదిరెడ్డి, కీత కనకయ్య, త్రిపురం సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్, డైరీలు పంపిణీ

మోతె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభాబాయి మనవడు అశ్విక్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు రూ. 10 వేల విలువ గల నోట్‌బుక్స్, డైరీలు అందజేశారు. కార్యక్రమంలో ధరావత్ హేమంత్, భారతి, లక్ష్మీకామేశ్వరి, నందకిశోర్, కవిత, ఉషారాణి, లకుపతి, ఉప్పయ్య, బేగం, గురులక్ష్మి పాల్గొన్నారు.